సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 21 । జనవరి । 2023



దంపతుల ఆత్మహత్య

ఏ కష్టమొచ్చిందో, ఎవరి వల్ల కష్టమొచ్చిందో గాని వృద్ధ దంపతులు గోదావరిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.


- IIలో ▸



కొనసాగుతున్న విన్యాసాలు

కాకినాడ తీరంలో ప్రారంభమైన నేవీ, ఆర్మీ విన్యాసాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియా తదితరులు వెళ్లి పరిశీలించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం స్వాధీనం



కొవ్వూరులో సీజ్ చేసిన బియ్యం లారీ

కొవ్వూరు: అక్రమంగా 22 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్న ఈ బియ్యం లారీని స్థానిక గామన్ ఇండియా టోల్‌గేట్ వద్ద పట్టుకున్నామని పౌరసరఫరాల విభాగం కొవ్వూరు డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజు తెలిపారు. లారీని సీజ్ చేసి, అందులోని రూ.8.47 లక్షల విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బియ్యాన్ని నిడదవోలులోని పౌరసరఫరాలశాఖ గోదాముకు తరలించినట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన లారీ ఓనర్ టి.సూరిబాబు, డ్రైవర్ సువ్వారి మోహన్‌లపై 6ఏ కేసు నమోదు చేశామని చెప్పారు. కొవ్వూరు ఆరు, పదో నంబర్ల సచివాలయాల రెవెన్యూ సెక్రటరీలు చదలవాడ లూక్ పాల్, అబ్దుల్ హాజీమున్నీసా ఈ దాడిలో పాల్గొన్నారు.

టూరిజం ఆర్డీగా స్వామినాయుడు

సాక్షి, రాజమహేంద్రవరం: పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్‌గా వి.స్వామి నాయుడు నియమితులయ్యారు. ప్రస్తుతం పోలవరం భూ సేకరణ విభాగంలో చింతూరు యూనిట్ -1 డిప్యూటీ కలెక్టర్‌గా ఈయన పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ఆయనకు స్థాన చలనం కలిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. స్వామినాయుడుతో పాటు పీఏ-టూ స్పెషల్ కలెక్టర్ కె.రాజ్యలక్ష్మిని మచిలీపట్నం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(ముడా) వీసీగా నియమించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కడియం: మద్యం తాగి విధులకు హాజరవుతున్నారనే అభియోగాలు నిజమేనని తేలడంతో జేగురుపాడు ప్రాథమిక పాఠశాల -1 ఉపాధ్యాయుడు డి.చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంఈఓ వి.లజపతిరాయ్ శుక్రవారం ఈమేరకు తెలిపారు.ఉపాధ్యాయుడి తీరుపై గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో జేగురుపాడు ఎంపీటీసీ ఆకుల సుధాకర్ ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశం దృష్టికి ఉపాధ్యాయుడి వ్యవహారం తీసుకువచ్చారు. దీంతో అధికారులు విచారణ జరిపి టీచర్‌ను సస్పెండ్ శారు.

భూసేకరణ ప్రత్యేక కలెక్టర్‌గా సరళా వందనం

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణ ప్రత్యేక కలెక్టర్‌గా ఎస్.సరళా వందనం, పీఏటూ స్పెషల్ కలెక్టర్‌గా కె.వేదవల్లిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు పీఏటూ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనుకుమార్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ సరళా వందనం వెలుగొండ భూసేకరణ ప్రత్యేక కలెక్టర్‌గా, వేదవల్లి ఒంగోలులో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా పనిచేశారు.

సంక్రాంతి ముందు ఈనెల 9నుంచి ఆదాయం (రూ.లలో)

జిల్లా	స్పెషల్స్	ప్రయాణికులు	దూరం (కి.మీ)	రాబడి
కాకినాడ	71	6,000	58,972	21,03,147
కోనసీమ	101	7,790	85,990	30,88,783
తూర్పుగోదావరి	118	8,498	82,657	28,00,000

సంక్రాంతి తిరుగు ప్రయాణం ఆదాయం (రూ.లలో)

జిల్లా	స్పెషల్స్	ప్రయాణికులు	దూరం (కి.మీ)	రాబడి
కాకినాడ	61	8,552	35,440	14,38,466
కోనసీమ	69	6,883	70,036	25,70,717
తూర్పుగోదావరి	71	5,680	44,569	16,50,000



తిరుగు ప్రయాణంలో ఇలా..

ఆర్టీసీకి పండగే పండగ

- కోవిడ్ తర్వాత సంక్రాంతికి భారీగా ప్రయాణికులు
- సాధారణ చార్జీల వసూలుతో పెరిగిన ఆదరణ
- ప్రభుత్వ నిర్ణయంతో సమకూరిన ఆదాయం
- అధికారులు, సిబ్బందిలో కనిపిస్తున్న ఆనందం



సీటు కోసం ఆత్రుత

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఆర్టీసీ గేర్ మార్చి స్పీడ్ పెంచింది. ఫలితంగా సంక్రాంతి పండగ బాగా కలిసి వచ్చింది. నష్టాల నుంచి కోలుకుని లాభాలతో రోడ్డెక్కింది. సాధారణ టికెట్ చార్జీలతో క్షేమంగా గమ్య స్థానాలు చేర్చే ఆర్టీసీ బస్సు వైపే ఈసారి పండగ ప్రయాణికులు అడుగులు వేశారు. రెండేళ్ల పాటు కోవిడ్-19 పరిస్థితులతో సంక్రాంతి పండగకు బంధుగణం స్వస్థలాలకు రావడానికి అంతగా మక్కువ చూపలేదు. ఇళ్లకు పరిమితమయ్యారు. అందుకే గడచిన రెండేళ్లు సంక్రాంతి పండగ వేళ పెద్దగా ప్రయాణాలు సాగలేదు. వచ్చిన కొద్దిమంది కూడా సొంత వాహనాల్లో వచ్చి వెళ్లిపోయారు.

స్పెషల్ బాదుడు లేదు

రెండేళ్ల తరువాత కోవిడ్ విపత్కర పరిస్థితి నుంచి పూర్తిగా ఉపశమనం లభించింది. దీంతో సంక్రాంతి పండగకు వేలాదిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు తరలివచ్చారు. ఆరు రోజులు ముందు వచ్చి, నాలుగు రోజుల తరువాత తిరిగి వెళ్లిన ప్రయాణికులు ఈ సారి ఆర్టీసీని బాగా ఆదరించారు. ఇందుకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం సంస్థకు బాగా అనుకూలించింది. గతంలో పండగలప్పుడు స్పెషల్ సర్వీసులలో ప్రయాణికుల టిక్కెట్లపై 1.5 శాతం అదనపు చార్జీలు విధించే వారు. ప్రభుత్వం ఈసారి అదనపు చార్జీలను పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీయే మేలనే ప్రజల నమ్మకం కూడా తోడైంది. ప్రైవేటు ట్రావెల్స్..ప్రయాణికుల అవసరాన్ని బట్టి టిక్కెట్ చార్జీలను హైదరాబాద్ వంటి ప్రాంతాలకు రూ.2,000 నుంచి రూ.3,000 వంతున ముక్కుపిండి మరీ వసూలు చేశాయి. ప్రభుత్వ ఆదేశాలతో రవాణా శాఖాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి కొంతమేర అడ్డగోలు దోపిడీని నియంత్రించగలిగారని చెప్పొచ్చు.

ఈసారి భారీగా రాకపోకలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందినవారు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారిలో ఎక్కువగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. రాష్ట్ర విభజనకు ముందు నుంచి హైదరాబాద్ నగరంలోనే ఇక్కడి వారు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. అటువంటి వారంతా మిగిలిన రోజుల మాటెలా ఉన్నా సంక్రాంతి పండగ మూడు రోజులు మాత్రం స్వస్థలాలకు కుటుంబ సమేతంగా వస్తుంటారు. వేడుకల్లో పాల్గొంటారు. ఏటా ఇది ఆనవాయితీగా వస్తోంది. అరమరికలు, మనస్పర్థలు ఉన్నా ఈ సంక్రాంతికి మాత్రం ఉమ్మడి తూర్పులోని అన్ని సామాజికవర్గాల కుటుంబాలూ ఒకచోట కలిసి ఆత్మీయతలు కలబోసుకున్నాయి. అనురాగాల మధ్య వేడుకలు జరుపుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి 50 వేల మందికి పైగానే ఆర్టీసీ బస్సులలో జిల్లాలకు చేరుకున్నారని అంచనా. విమానయానం, రైల్వే, ప్రైవేటు ట్రావెల్ సర్వీసులు, వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణించిన వారు 40 వేల వరకు ఉంటారని భావిస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందు ఈ నెల 9వ తేదీ నుంచి కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు రావడం మొదలుపెట్టిన ప్రయాణికులు కనుమ నుంచి 19 వరకు తిరుగు ప్రయాణం చేశారు. చాలా కుటుంబాల్లో బంధువులు, ఆడపడుచులు పుట్టింటి నుంచి శుక్రవారం సెంటిమెంట్‌గా తిరిగి వెళ్లరు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీ డిపోలలో ప్రయాణికులు పలుచగా కనిపించారు. తిరిగి ఆదివారం ప్రయాణాలు మొదలయ్యే అవకాశముందని ఆర్టీసీ ఆశలు పెట్టుకుంది.

ఆదరణ బాగుంది



సంక్రాంతి పండగ ఆర్టీసీకి కలిసొచ్చింది. ప్రైవేటు ట్రావెల్స్‌లో అధిక చార్జీలతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు వచ్చారు. సంక్రాంతికి ముందు, సంక్రాంతి తరువాత కూడా ఒకే రకంగా ప్రయాణించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షితం కావడంతో మా సంస్థకు ఆదరణ పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియో కూడా బాగా పెరిగింది. కిలోమీటరుకు వచ్చే ఆదాయం కూడా పెరగడం సంతోషాన్నిచ్చింది.

\- షర్మిలా అశోక్, జిల్లా ప్రజారవాణా అధికారి, రాజమహేంద్రవరం

డిసెంబర్ నాటికి ఫ్లైఓవర్ పూర్తి కావాలి

- పనులు ఆలస్యంగా జరిగితే కుదరదు
- పీడీ సురేంద్రతో ఎంపీ భరత్ రామ్



మోరంపూడి జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: పనులు ఎందుకింత ఆలస్యంగా చేస్తున్నారు.. ఇలాగైతే ఫ్లైఓవర్ ఎప్పటికి పూర్తవుతుంది అంటూ నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ సురేందర్‌పై వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అసహనం వ్యక్తం చేశారు. మోరంపూడి జంక్షన్ వద్ద సృష్టి కాంట్రాక్టు ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడే ఉన్న పీడీ సురేందర్‌తో పనులు ఆలస్యంగా జరుగుతుండడంపై ప్రశ్నించారు. పండగ వల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని పీడీ సమాధానం చెప్పడంతో పండగ కాదు, పనులు ప్రారంభించడమే చాలా ఆలస్యంగా జరిగిందని ఎంపీ అన్నారు. ఎట్టి పరిస్థితులోనైనా ఈ ఫ్లైఓవర్‌పై డిసెంబర్‌లో వాహనాలు తిరగాలి, పనులు త్వరగా చేపట్టండని ఆదేశించారు. పిల్లర్ల నిర్మాణం, విద్యుత్ లైన్లు మార్పును పరిశీలించారు. మిగిలిన బ్రిడ్జిలకు సంబంధించి డీపీఆర్‌లు తనకు ఎంత త్వరగా ఇస్తే అంత త్వరగా ఢిల్లీ వెళ్లి మంజూరు చేయించుకుంటానని పీడీ సురేందర్‌కు భరత్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్మితా శుక్లా, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ సురేష్ గౌడ్, ప్రాజెక్ట్ కంట్రోలర్ చెన్నకేశవ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలపై ఖండన

కాకినాడ క్రైం: టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విభాగం ఖండించింది. ఈ మేరకు శుక్రవారం అధ్యక్షుడు సత్యంమూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవన్నారు.

విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం

హోం మంత్రి తానేటి వనిత



అదనపు తరగతి గదుల భవనం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని పండిత మదన మోహన్ మాలవ్య మునిసిపల్ హైస్కూల్లో నిర్మించే అదనపు తరగతుల భవనానికి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. నాడు-నేడు రెండో ఫేజ్‌లో రూ.1.08 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తారు. కార్యక్రమంలో కలెక్టర్ కె.మాధవీలత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మంత్రి వనిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నాడు-నేడు పథకంలో స్కూళ్ల రూపురేఖలను మారుస్తున్నామన్నారు. జగన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు, బెల్టు, సాక్స్‌లు, బ్యాగ్ వంటి వాటితో ఏటా కిట్లు అందిస్తున్నామని చెప్పారు. బోధనా పద్ధతు ల్లోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి ఎన్నో పథకాల ద్వారా పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి బాటలు వేస్తున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా సీబీఎస్‌ఈ విధానం అమలు, బైజూస్ యాప్‌లను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు.

స్కూళ్ల ఆధునీకరణ

జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 598 స్కూళ్లు, 19 జూనియర్ కళాశాలల్లో ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలు బాధ్యత తీసుకుని మంచి వాతావరణంలో విద్యార్థులకు బోధన చేసేలా చూడాలని సూచించారు. కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్లో తొమ్మిది అదనపు తరగతులతో భవనాన్ని నిర్మించనున్నట్టు ప్రకటించారు. అనంతరం శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, బత్తి నాగరాజు, హెచ్‌ఎం వి.గంగాభవాని, ఎంఈవో జె.కెంపురత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలన్నీ రైతులకు చేరాలి

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ మాధవీలత
- హాజరైన డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ రైతులకు చేరాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. రబీలో ఈ పంట నమోదు, పౌరసరఫరాలు, పశు సంవర్ధక, ఉద్యానవన, ఎలుకల నివారణ కార్యక్రమం, మిలెట్స్ సాగుపెంపు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 ఏడాదిని అంతర్ రాష్ట్రీయ చిరు ధాన్యాల సంవత్సరంగా భారత ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నిర్దిష్ట ప్రణాళికను రూపొందించుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చించిన అంశాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు కార్యాచరణ అమలు చేయాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, సాగునీరు అందజేయడంతో పాటు పండించిన ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తొర్రేడు, పెండ్యాలకు సంబంధించిన సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ముందస్తుగా సాగునీరు విడుదల చేస్తున్న దృష్ట్యా ఆయా మండలాలకు ఎరువులు, విత్తనాలు, మౌలిక వనరులను పంపిణీ చేయాలన్నారు.

2,120 ఎకరాల్లో ఆక్వాసాగు

డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ రైతుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, వాటి శాశ్వత పరిష్కారం కోసం ఈ సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలో సుమారు 2,120 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. ఫిష్ ఆంధ్రా పథకంలో భాగంగా డొమెస్టిక్ మార్కెట్ విధానం ప్రోత్సహించడం, యూనిట్ల స్థాపనకు సబ్సిడీతో కూడిన పథకాలు ఉన్నట్లు తెలిపారు. మత్స్యశాఖ అధికారులను సంప్రదించి తగిన శిక్షణ పొందవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాదిని చిరు ధాన్యాలు పండించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించారన్నారు. చిరు ధాన్యాల సాగుపై ప్రత్యేక కథనాలను ప్రచురించడం ద్వారా సాగువిస్తీర్ణం పెంచాలన్నారు. దీనిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పశువులకు సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సబ్సిడీ అనంతరం కేజీ రూ.6.50కు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే తేజ, జి.జనార్ధనరావు, ఆదర్శ రైతులు ఎం.నరసింహారావు, డి.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు



బొమ్మూరు హైస్కూల్లో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వీణాదేవి

అన్నింటికీ.. ఆధారమే

- 63 సచివాలయాల్లో ఆధార్ సేవలు
- పదేళ్ల తరువాత నవీకరణ తప్పనిసరి
- 24 వరకూ స్పెషల్ క్యాంపులు
- ఒక్కరోజులోనే 1330మందికి ఆధార్‌సేవలు



రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశం, బ్యాంకుఖాతాలు, మొబైల్‌సిమ్ పొందడం ...ఇలా ఏ అవసరానికైనా ప్రస్తుతం ఆధార్ కార్డే ఆధారమైంది. పదేళ్ల ముందు కార్డు పొందిన వారు తగిన గుర్తింపు కార్డులతో ఆధార్‌కేంద్రాలకు వెళ్లి తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని యునిక్ ఐడెంటీఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏ) ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. దీంతో గతంలో పోస్టాఫీసులు, బ్యాంకులు, ఆధార్‌కేంద్రాల్లో మాత్రమే లభిస్తున్న ఆధార్‌సేవలు ప్రస్తుతం గ్రామ,వార్డు సచివాలయాలకు చేరాయి. ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణ, కొత్తకార్డులనమోదు, ఉన్న కార్డుల అప్‌డేట్‌కోసం గ్రామీణులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ప్రత్యేక శిబిరాలు

ఆధార్‌లో ఎటువంటి తప్పులు లేకుండా తప్పనిసరిగా నవీకరణ చేసుకోవాలి. సంక్షేమ పథకాల లబ్ధిపొందాలంటే ఆధార్ తప్పనిసరి. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ప్రజలకు సౌకర్యంగా ఉంది. ప్రజలకు మరింత ఆధార్ సేవలను అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశాం.

\- వీణాదేవి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి

తొలిసారి నమోదు ఉచితమే...

జిల్లాలోని 63 సచివాలయాల్లో ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం ల్యాప్‌టాప్, ప్రింటర్, స్కానర్,ఐరిష్,వేలిముద్రల పరికరాలతో కలిపి కిట్లను సచివాలయాలకు అందించారు. డిజిటల్ అసిస్టెంట్లకు పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ప్రింటర్,స్కానర్, వేలిముద్రల పరికరాలపై శిక్షణ ఇచ్చారు. తొలిసారి ఆధార్ కార్డు నమోదు చేసుకునే పిల్లలకు ఉచితంగా అందిస్తున్నారు. వారి నుంచి ఎటువంటి నగదు వసూలు చేయరు. పూర్తిబయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.100, సవరణకోసం రూ.50, ఆధార్ ప్రింట్‌కు రూ.30 చొప్పున మాత్రమే నగదు చెల్లించాలి.

అప్‌డేట్ లేక ఫోన్లకు ఆగిన మేసేజ్‌లు

ఆధార్ అప్‌డేట్ చేసుకోకపోవడంతో సెల్‌ఫోనుకు ఎలాంటి మెసేజ్‌లు రాక చాలా మంది ప్రజలు ఇబ్బందిపడ్డారు. అప్‌డేట్ చేసుకున్నాక మేసేజ్‌లు వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఈనెల 19,20,21,22,23,24 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో గురువారం ఒక్కరోజే 1,330 మంది ఆధార్‌సేవలు అందించారు. ఐదేళ్ల పిల్లలు, 15 ఏళ్ల వయసు పూర్తయిన వారు విధిగా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. ఆ కేటగిరి విద్యార్థులు అధికసంఖ్యలో ఉన్న పాఠశాలల్లో సైతం ప్రభుత్వం ఆధార్ ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసింది.

స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ కల్పనాసింగ్

నల్లజర్ల: తెలికిచెర్ల శివారు కమతంగుంటలోని ఢిల్లీ పబ్లిక్ స్కూలులో రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-14 ఫుట్‌బాల్ టోర్నమెంటును ప్రిన్సిపల్ శ్రీమతి కల్పనాసింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ ఎం.మనోహర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు ఉన్న ప్రాముఖ్యతను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. 13 జిల్లాల నుంచి దాదాపు 520 మంది పోటీలలో పాల్గొంటున్నారన్నారు. భారతీయ విద్యాభవన్స్‌లో బాలికలకు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాలురకు పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలు జరుగుతాయన్నారు. స్కూల్ చైర్మన్ చెరుకువాడ నరసింహరాజు (నరేష్) డైరెక్టర్ మణికుమార్ పాల్గొన్నారు.

మడ అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతున్న మడ అడవుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన తాళ్లరేవు మండలంలో పర్యటించారు. ఆయన తొలుత చొల్లంగిలోని కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. అనంతరం కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కొమ్మినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మడ అడవుల సంరక్షణ–సామాజిక బాధ్యత–మీడియా పాత్ర, జర్నలిజం మౌలిక సూత్రాలు, విలువలు తదితర అంశాలపై ఏపీ ప్రెస్ అకాడమీ, అటవీ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మడ అడవులు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడంతోపాటు ఎన్నో జీవులకు ఆవాసంగా ఉన్నాయన్నారు. తుపానులు, సునామీల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుతూ తీర ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న మడ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కోరంగి అభయారణ్యం గురించి ప్రముఖ నగరాలకు, ఇతర రాష్ట్రాలకు తెలియజేస్తే వేలాది మంది పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు.

మడ అడవుల సంరక్షణే...
భవిష్యత్ తరాలకు ఇచ్చే ఆస్తి

మానవాళికి ఎంతో మేలు చేస్తున్న మడ అడవుల సంరక్షణే మనం భవిష్యత్తు తరాలకు ఇచ్చే ఆస్తి అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. అభయారణ్యం, హోప్ ఐలాండ్‌లు మన ప్రాంతానికి ఒక అదృష్టమన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడి ఎన్నో వైపరీత్యాల నుంచి ఇక్కడి ప్రజలను కాపాడుతున్న వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కోరంగి అభయారణ్యాన్ని ప్రత్యేక ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లామని ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గతంలో కేంద్ర పర్యాటక మంత్రిగా పనిచేసిన చిరంజీవి రూ.6 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మడ అడవులకు నష్టం కలుగకుండా ఎకో టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, ఆక్వా కల్చర్ కారణంగా మడ అడవులకు నష్టం కలుగుతుందని, అరుదైన మత్స్య జాతులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. వీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. జర్నలిజంలో విలువలు లోపిస్తున్నాయని, జర్నలిస్టులు సంచలనమైన వార్తలే కాకుండా పరిశీలనాత్మకమైన వార్తలు కూడా రాయాలని పిలుపునిచ్చారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ మాట్లాడుతూ మడ అడవుల సంరక్షణకు తమ ప్రభుత్వం తరపున కూడా సహాయ సహకారాలు కూడా అందజేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన పలువురిని కొమ్మినేని సత్కరించారు. అనంతరం బయోడైవర్సిటీ సెంటర్, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎం.బాలగంగాధర్ తిలక్, ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్సార్ సీపీ నేతలు దున్నా జనార్ధనరావు, కుడుపూడి శివన్నారాయణ, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ముదునూరి సతీష్‌రాజు, పెన్మెత్స చిట్టిరాజు, పర్యావరణ వేత్త పేరిచర్ల రాజగోపాల్‌రాజు, రాయుడు గంగాధర్, ఉంగరాల వెంకటేశ్వరరావు, కేసరి శ్రీనివాసరావు, సీతారామరాజు, అటవీ అధికారులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని. చిత్రంలో ఎమ్మెల్యేలు కన్నబాబు, పొన్నాడ, అశోక్

కొన్ని పత్రికలు విలువలను కాలరాస్తున్నాయి

రాష్ట్రంలో కొన్ని పత్రికలు జర్నలిజం విలువలను కాలరాస్తున్నాయని కొమ్మినేని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి ఫలితంగా ఏర్పాటైన శ్రీసిటీ విషయంలో ఆ పత్రికలు 2006లో సెజ్‌లకు నజరానా, 2008లో సెజ్ కుంపట్లు అని రాశాయన్నారు. అవే పత్రికలు 2016లో బతుకు మార్చిన భాగ్యసీమ అంటూ కీర్తిస్తూ రాశాయని ఇవి పత్రికా విలువలేనా అని ప్రశ్నించారు. జర్నలిజం మౌలిక సూత్రాలను ఆ పత్రికలు మరిచాయన్నారు. శ్రీ సిటీని ఇటీవల సందర్శించానని, 25 దేశాలకు చెందిన 250 సంస్థలు ఉన్నాయని, వాటి సందర్శన తరువాత వైఎస్సార్‌పై అభిమానం వంద రెట్లు పెరిగిందన్నారు. జర్నలిస్టులు అవాస్తవాలు రాయవద్దని కోరారు. ఇటీవల ఒక రాజకీయ పార్టీ సభలో తొక్కిసలాట జరిగిన సంఘటనపై పోలీసుల వైఫల్యం అని ఆ పత్రికలు రాశాయని, ఏ విధమైన వైఫల్యాలో ప్రస్తావించకుండానే రాయడం జర్నలిజానికి తగదన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో... : ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్‌గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబరు 9912220345. గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

గోదావరిలో దూకి దంపతుల ఆత్మహత్య

కొవ్వూరు: ఏ కష్టమొచ్చిందో, ఎవరి వల్ల కష్టమొచ్చిందో గాని వృద్ధ దంపతులు గోదావరిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఏలూరు జిల్లా ఏలూరు నగరానికి చెందిన కేదారి కొండలరావు (65), ఆయన భార్య ఉమా మల్లేశ్వరి (55) తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో శుక్రవారం ఉదయం విగత జీవులుగా తేలియాడుతూ కనిపించారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహాలను పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టానికి కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో లభించిన పెన్షనర్స్ అసోసియేషన్ కార్డు ఆధారంగా మృతదేహాలను గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. మృతుడు కొండలరావు ఆంధ్రాబ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. భార్య ఉమామల్లేశ్వరి గృహిణి. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమై ప్రస్తుతం అమెరికాలో స్థిరపడినట్టు మృతుల కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడికి ఇంకా వివాహం కాలేదు. అతని వల్లే ఈ దంపతులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు తెలియ వచ్చింది. ఆ దంపతులు గురువారం ఏలూరులోని ఇంటి నుంచి బయలుదేరినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల వారు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నట్లు మృతుడికి వరుసకు సోదరుడైన వెంకటరమణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.